# పయనమయే ప్రియతమా

-- నిషిగంధ

వర్షం ఇంకాస్త పెద్దదయింది.. స్వామి వారిది అయిపోయింది, ఇప్పుడు మా వంతంటూ గుడిమెట్లు తృప్తిగా అభిషేకం చేయించుకుంటున్నాయి.. గుడి మంటపంలోనించి చూస్తుంటే చిన్న చిన్న రాళ్ళు జారుడు బండ ఆడుతున్నట్లు కేరింతలు కొడుతూ కిందకి జారిపోతున్నాయి.. ఉన్నట్టుండి చల్లగాలి బలంగా తాకేసరికి మెడలోనించి చున్నీని తీసి భుజాల చుట్టూ కప్పుకున్నాను..

"బయలుదేరినప్పుడు కూడా బాగా చలిగాలి వీస్తోంది కదా.. స్వెట్టర్ వేసుకుని రాకూడదూ!" కాస్త కోపంగానే అన్నాడు.. నవ్వి ఊరుకున్నా.. అతను అలా కోప్పడుతుంటే నాకు చాలా బావుంది!

"పరీక్షలన్నీ బాగా రాస్తున్నావుగా?" ఈసారి తల తిప్పకుండానే అడిగాడు..

"ఊ పర్వాలేదు.. మీరు?" చలికి ఇంకాస్త ముడుచుకుంటూ అడిగాను..

"అన్నీ బాగా రాసానులే.. థియరీ అయిపోయాక కాస్త ప్రశాంతంగా ఉంది.. రేపటి నించి ప్రాక్టికల్స్. వచ్చే వారం ఈపాటికి లగేజ్ సర్దేస్తుంటాను" ఏదో ఇష్టంలేని విషయం చెప్తున్నట్లు ఆగి ఆగి చెప్పాడు..

"మీరు లక్కీ.. మేమింకా రెండు వారాలు ఆగాలి ఇంటికెళ్ళడానికి" లోపల్నించి తన్నుకొస్తున్న బాధని కళ్ళు ఎక్కడ చూపించేస్తాయో అన్న భయంతో చటుక్కున తల దించేసి చున్నీ అంచుల్ని వేలికి గబగబా చుట్టేస్తున్నా..

"మూడేళ్ళు ఎలా గడిచిపోయాయో కదా!" అతనంటుంటే "అదేంటీ మీకు గడిచింది నాలుగేళ్ళు కదా!?" ఏమి తెలీనట్టే అడిగాను.. చిన్నగా నవ్వేసి "మొదటిసారి ఇక్కడే చూశాను నిన్ను.. పెద్దపెద్దగా హనుమాన్ చాలీసా చదువుతున్న నిన్ను మీ ఫ్రెండ్స్ సాయిబాబా గుళ్ళో అదేంటని అడిగితే 'నాకిదే తప్పులు లేకుండా కంఠతా వచ్చు 'అంటున్న నిన్ను చూస్తే నాకైతే నవ్వాగలేదు" మళ్ళీ జ్ఞాపకం తెచ్చిన సంతోషం అతని మొహంలో!

వెంటనే "నేను ఎం.టెక్. చేయాలనుకుంటున్నా.. అదీ ఐ.ఐ.టి లో.. మనలాంటి డొనేషన్ కాండిడేట్లకి కష్టమే అనుకో.. కానీ ఎంత కష్టపడైనా సీట్ తెచ్చుకోవాలనుంది" అని చెప్తూంటే నేను "అదేంటీ మీకు ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదు కదా!?" వాళ్ళ బిజినెస్ ని మనసులో పెట్టుకుని అడిగాను..

"ఉద్యోగం కోసం వెతుక్కోనక్కర్లేకపోతే ఇంక చదవడం అనవసరమంటావా!! అయితే రేపు ఎలాగూ పెళ్ళి చేసేస్తారు కదా అని నువ్వు నీ చదువుని నిర్లక్ష్యం చేయటం లేదు కదా!?" కాస్త మందలించినట్టే చెప్పాడు.. మళ్ళీ తనే "నువ్వు నిర్ణయించుకున్న లక్ష్యం బట్టి నువ్వేంటో అంచనా వేయొచ్చు" అంటుంటే నా మనసులో బాధ పక్కనే నెమ్మదిగా చోటు చేసుకుంటున్న పట్టుదల!!

చదువు పేరుతో ఇంటికి దూరంగా కాలేజీ అనే రంగుల ప్రపంచంలో పడగానే స్నేహాలు, సరదాలు, అల్లర్లు, మధ్య మధ్య పరీక్షల టెన్షన్స్, ఇంట్లో వాళ్ళ మీద దిగుళ్ళు.. అనుకోకుండా ఇతని పరిచయం.. ఒక సంవత్సరం జూనియర్ ని కాబట్టి సబ్జెక్ట్స్ లో ఎప్పుడూ హెల్ప్ చేస్తూనే ఉండేవాడు.. ఇది స్నేహమో, ఇష్టమో, ప్రేమో, లేక ఇంకేదన్నానో అతను ఎప్పుడూ చెప్పలేదు.. నేనూ అడగలేదు.. కానీ ఒకరి సాన్నిహిత్యాన్ని ఒకరం ఇష్టపడటం మాత్రం తెలుస్తూనే ఉంది.. ఇప్పుడు ఫైనల్ ఇయర్ ముగించుకుని వెళ్ళిపోతున్నాడు, ఇంకో సంవత్సరం నేనొక్కదాన్నే ఇక్కడ ఎలా ఉంటానోనన్న లోచన కొంచెం కూడా లేకుండా!!

"నువ్వు జాగ్రత్త" మనసు చదివేసినట్టు! "మా కజిన్ కి చెప్పాను.. ఏ హెల్ప్ కావాలన్నా మొహమాటపడకుండా వాడిని అడుగు" ఉన్నట్టుండి నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని అన్నాడు..

మొదటి స్పర్శ! మూడేళ్ళలో! ఒళ్ళు ఝల్లుమనలేదు.. మనసు అదోలా అయిపోలేదు.. రోజా తన బాగోగులు చూసే తోటమాలి చేతుల్లో భద్రంగా ఒదిగిన గులాబీలా.. నిశ్చింతగా అనిపించింది!! జారిపోతున్న నిమిషాల ఊసు పట్టించుకోవాలనిపించటం లేదు..

చాలా సేపటినించీ నొక్కి పెట్టిన ప్రశ్న నా వల్ల కాదంటూ బయటకొచ్చేసింది.. "మళ్ళీ కనిపిస్తారు కదూ?"

అదే నవ్వు! సర్కస్ నించి బయటకొస్తూ మళ్ళీ ఎప్పుడు చూపిస్తారంటూ అడుగుతున్న పాపని చూసినట్టు..

ఇక మాకేమాత్రం మొహమాటం లేదని కంటి కొసలనించి నీళ్ళు గబగబా బయటికి దూకేశాయి.. తన చేతిలో నా చెయ్యి ఇంకాస్త బిగుసుకుంది.. "వర్షం తగ్గింది.. ఇంక వెళతాను" అమాంతంగా పెరిగిపోతున్న గుండె బరువు ఇంక మోయలేక లేచాను..

"ఉండు.. నేను మీ హాస్టల్ గేట్ వరకూ దిగబెడతాను" తనూ లేవబోతుంటే నేను వారిస్తూ అన్నా "లెట్ మి బి ది వన్ హు ఈజ్ లీవింగ్, ఫర్ నౌ.. విష్ యు ల్ ది బెస్ట్ !".. చెయ్యి విడివడింది..

చెప్పులు వేసుకుని మొదటిమెట్టు దిగబోతుంటే ఒక్కసారి.. ఒకే ఒక్కసారి.. వెనక్కి తిరిగి తనని చూడాలనిపించింది.. కానీ దిగిపోయాను.. నాకు తెల్సు ఒక్కసారి వెనక్కి తిరిగితే ముందుకెళ్ళడం చాలా కష్టమని!